సంక్షేమం-అభివృద్ధితో అంతకాపల్లి పరుగులు



సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ అభివృద్ధిలో పరుగులుతీస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఓవైపు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తోంది. అలాగే పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తు అభివృద్ధి పనులు చేస్తోంది.


విధుల్లో తలమునకలైన సచివాలయ సిబ్బంది


గృహ నిర్మాణ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు(ఫైల్)

సంక్షేమ పథకాలతో చాలా మంది నిరుపేదలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. స్వయం ఉపాధి పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులకు పథకాలు అందాలంటే నాయకులు చుట్టూ తిరగాల్సి వచ్చేంది. ఇప్పుడు ప్రభుత్వమే వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఏయే పథకాలకు ఎవరెవరు అర్హులో నిర్ధారించి లబ్ధి చేకూరుస్తున్నారు.


ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హైమ

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి
అమ్మ ఒడి	398	రూ.1,87,55,555
జగనన్న విద్యాదీవెన	370	రూ.1,24,83,584
జగనన్న వసతి దీవెన	296	రూ. 45,34,397
రైతు భరోసా	788	రూ.3,91,89,150
పంటల బీమా	22	రూ. 86,788
సున్నా వడ్డీ పంట రుణాలు	128	రూ. 1,75,122
రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ	24	రూ. 35,520
వైఎస్సార్ పెన్షన్ కానుక	681	రూ.7,52,36,500
వైఎస్సార్ చేయూత	374	రూ.1,71,75,000
ఆసరా	1009	రూ.3,71,31,422
సున్నా వడ్డీ	1167	రూ 26,55,981
ఈబీసీ నేస్తం	2	రూ. 60,000
కల్యాణమస్తు	2	రూ. 1,00,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	184	రూ. 66,17,413
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	98	రూ. 7,02,200
హౌసింగ్	89	రూ. 1,06,98,358
వైఎస్సార్ బీమా	19	రూ. 25,75,000
వాహన మిత్ర	38	రూ. 11,60,000
చేదోడు	47	రూ. 11,90,000
కోవిడ్ సహాయం	1178	రూ. 11,78,000
జగనన్న తోడు (వడ్డీ)	109	రూ. 55,969



అంతకాపల్లి గ్రామ సచివాలయం

అంతకాపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని జనాభా	4,444 మంది
మొత్తం ఓటర్లు	3,529
సంక్షేమ పథకాల ద్వారా అందించిన మొత్తం నిధులు	రూ.29.37 కోట్లు
డీబీటీ విధానంలో అందించిన నిధులు	రూ23.17 కోట్లు
సంక్షేమం, నాన్ డీబీటీ విధానంలో అందించిన నిధులు	రూ.6.20 కోట్లు
అభివృద్ధికి కేటాయించిన నిధులు	రూ.9.13 కోట్లు

ధైర్యంగా జీవిస్తున్నా...



నా భర్త స్వామినాయడుతో కలిసి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్లం. భర్త మృతి చెందిన నాటి నుంచి ప్రభుత్వం ప్రతి ఏడాది చేయూత ద్వారా రూ.18,750 ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. దీంతో పాటు రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున అందుతోంది. మరో పక్క వైఎస్సార్ ఆసరా వస్తోంది. ప్రతి నెల రూ.3 వేలు వితంతు పింఛను అందుతోంది. ఎవరిపైనా ఆధారపడకుండా ధైర్యంగా బతుకుతున్నా.

– ముత్యాలమ్మ, అంతకాపల్లి, సబ్బవరం

జగన్‌కు రుణపడి ఉంటా



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వృద్ధాప్య పింఛను వస్తోంది. ప్రతీ ఏటా రైతు భరోసా రూ.13,500 ప్రభుత్వం అందుకుంటున్నా.. భర్త, కుమారుడు మృతి చెందారు. మరో ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేదలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఆదుకుంటోంది. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

–మానేపల్లి పార్వతి,
అంతకాపల్లి గ్రామం,సబ్బవరం మండలం,

ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు



గ్రామంలో 26 మంది వలంటీర్లు పనిచేస్తున్నాం. ప్రభుత్వం అందించే అన్ని రకాలు సేవలు, సమాచారాన్ని ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో చేపట్టిన నాటి నుంచి వలంటీర్‌గా పనిచేస్తున్నా. నా క్లస్టర్ పరిధిలో 57 కుటుంబాలు ఉన్నాయి. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.

– ఎం.సత్యలావణ్య, వలంటీర్,
అంతకాపల్లి, సబ్బవరం మండలం

గ్రామాలు కళకళ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు స్వయం ఉపాధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. దీంతో పాటు స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కృషితో గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

– సబ్బవరపు నారాయణమూర్తి,
సర్పంచ్,అంతకాపల్లి గ్రామం.సబ్బవరం

క్లుప్తంగా

ఘనంగా కుంకుమార్చన


సాముహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న శ్రీ సీతారామాలయ 21వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మీదేవికి సామూహిక కుంకుమపూజను విశేషంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి సామూహికంగా కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ మహిళలతో అమ్మవారి పూజను శాస్త్రోక్తంగా ఆచరింపజేశారు. వార్షికోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఆదివారం నుంచి ఉపాలయాలయ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వెంకన్నకు క్షీరాభిషేకం


వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష క్షీరాభిషేకం జరిపారు. పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి వేదికపై వేంజేపంచేశారు. విష్వక్సేణపూజ,పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

పెందుర్తి సిద్ధం సభ వాయిదా

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదివారం తలపెట్టిన సిద్ధం సభ కొన్ని కారాణాల రీత్యా తాత్కాలికంగా వాయిదా పడింది. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గమనించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఓ ప్రకటనలో కోరారు. త్వరలోనే సిద్ధం సభ నిర్వహిస్తామని చెప్పారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


ఈవో శ్రీనివాసమూర్తికి చెక్కుఅందజేస్తున్న దాత

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని సీతంపేటకి చెందిన కరణం వెంకటేశ్వరరావు రూ1,00,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరుపున దాతకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097
సాక్షి

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం


నృసింహ హోమాన్ని నిరవహిస్తున్న అర్చకులు


ప్రధాన కలశను శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : స్వాతి నక్షత్రంను పురస్కరించుకుని సింహగిరిపై శుక్రవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది.లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.దీనిలో భాగంగా ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణమండపంలో హోమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణమండపం వద్దకు తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద వేంజేంపజేశారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై వేంజేంపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారన చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై జల్లారు. దేవస్థానం తరపున ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు చక్రవర్తి, చిన్నా తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

సబ్బవరం : సబ్బవరం మండలంలో ఇంటర్ పరీక్షలు తొలిరోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన తెలుగు, సంస్కృతం పేపర్-1 పరీక్షలకు 100 మంది విద్యార్థులకుగాను 94 మంది పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటిండెంట్ యూవీఎస్ వర్మ తెలిపారు. ఒకేషనల్, జనరల్ ఫౌండేషన్ కోర్సులకు 251 మంది విద్యార్థులకు 236 మంది హాజరయ్యారు. డిపార్టుమెంట్ ఆఫీసర్ జేఎస్ఎస్ ప్రభ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు వర్మ తెలిపారు.

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 396 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 393 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటిండెంట్ జేఎల్ కుమారి చెప్పారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదోడ్ల సౌకర్యం, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్షా కేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు తెలిపారు.

నైపుణ్యాలతో మెరుగైన అవకాశాలు సాధ్యం


మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, అప్పుడు మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన యాత్రిక 2కే24 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మార్కులు అవసరమే కానీ.. అవే ప్రధానం కాదన్నారు. నైపుణ్యాలు, ప్రత్యేక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ, బ్లాక్‌చైన్, ఎంఐ, ఐవోటీ, ఇండస్ట్రీ 4.0 వంటి సాంకేతికతలను అన్ని శాస్త్రాలతో మిళితం చేస్తూ ఉపయుక్తంగా నిలుపుకోవాలని సూచించారు. శాస్త్ర అంశాలను నేర్చుకోవడంతో పాటు వాటిని నిత్య జీవితంలో అన్వయించడం ఎంతో అవసరమన్నారు. నూతనంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్రాలను, సాంకేతికతను యువతకు అలవాటు చేస్తూ వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. ఎడ్‌ఎక్స్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఎంవోయూలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ కళాశాలలో వసతులను సద్వినియోగం చేసుకుంటూ పూర్తి సామర్థ్యాలతో పని చేయాలన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి మాట్లాడుతూ 5 వేల పుస్తకాలతో గ్రంథాలయం, డిజిటల్ స్మార్ట్ బోర్డులు, అధునాతన వసతులతో ప్రయోగశాలలు, 92 శాతం మంది విద్యార్థినులకు ఉద్యోగాలు లభించాయని తమ కళాశాల ప్రత్యేకతలను వివరించారు. తమ విద్యార్థులు ఐదుగురికి జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్‌లు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు పి.ప్రజ్ఞ, జి.శిరీష, ఎస్.అరుణ, స్టూడెంట్ కన్వీనర్ వెన్నెల తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో ఈ నెల 8న నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకలకు సన్నాహాలు ప్రారంభించామని గ్రామ సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు చెప్పారు. ఈ మేరకు అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం రాంపురంలో ఆవిష్కరించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి సాముగరిడీలు, చిడతలు, తప్పెడు గుళ్లు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి కోవిరి నూకరాజు, మైలపల్లి బంగార్రాజు, పెదముషిడివాడ వైఎస్సార్‌సీపీ నాయకుడు కబడ్డి అప్పారావు, సూరాడ చినమసేను, స్పీడ్ మసేను, నల్ల మసేను, కొవిరి నంబారి, దూడ అప్పారావు పాల్గొన్నారు.

నేడు గొరపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెందుర్తి: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెందుర్తి మండలం గొరపల్లిలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రామ సచివాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా కంటి సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేస్తామని పేర్కొన్నారు.

ఆలోచింపజేసిన 'వ్యవసాయం'

మద్దిలపాలెం : స్థానిక కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నెల్లూరుకు చెందిన ప్రియదర్శిని నాటిక సమితి ఆధ్వర్యంలో వ్యవసాయం నాటికను ప్రదర్శించారు. జీవీకే మూర్తి కలం నుంచి జాలువారిన కథకు సుధా దర్శకత్వంలో ప్రదర్శించిన వ్యవసాయం సాంఘిక నాటిక ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. వ్యవసాయ క్షేత్రంలో రైతు కలుపు మొక్కలను తొలగించి పది మంది ఆకలి తీర్చే పంటను పండిస్తాడు. అలాగే ప్రతి మనిషి తన మనో క్షేత్రంలో ఉండే నేను, నాది అన్న స్వార్థంతో, దోపిడీ, అవినీతి, అధర్మం అనే కలుపు మొక్కలను తొలగించి, మనం మనది, అనే పచ్చటి పంటను పండించే ఇతివృత్తంతో ఈ నాటిక సాగింది. కథకు తగ్గట్టుగా నటీనటులు తమ నటనతో అందర్నీ మెప్పించారు.

'జగనన్న సురక్ష'లో 362 మందికి పరీక్షలు


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అప్పలరాజు

పరవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పరవాడ మండల వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు కోరారు. వాడచీపురుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ అప్పలరాజు మాట్లాడుతూ వైద్య సేవలు అందని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి వైద్య సేవలు అందిస్తూ మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారన్నారు. వైద్య శిబిరంలో కళ్లు, చెవి, ముక్కు, గొంతు, పలు ఇతర వ్యాధులకు సంబంధించి వచ్చిన 362 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ కె.ఉమామహేశ్వరి, పంది ప్రసాద్, నాయకులు మాసవరపు అప్పారావు, సచివాలయ కార్యదర్శి అనిల్, వీఆర్వో హేమలత, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శిఖర యంత్ర త్రిరాత్రి ఉత్సవాలు


యాగం నిర్వహిస్తున్న దృశ్యం


విద్యుత్ కాంతులతో రామాలయం

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో సంపత్ వినాయక పూర్వక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత కోదండ రామాలయ శిఖ యంత్ర మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణ నడుమ గోధూళి వేళలో విష్వేశ్వరపూజ, అఖండ దీపారాధన, దీక్షాకంకణధారణ, యాగశాల ప్రవేశం చేశారు. గ్రామంలోని పలువురు దంపతులు హోమ క్రతువులో పాలుపంచుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఆలయ శిఖర యంత్రాలకు పూర్ణకలశాలతో భక్తులతో జలాదివాసం జరుగుతోంది. అగ్ని ప్రతిష్ట చేస్తారు. సాయంత్రం 4.15 గంటలకు విగ్రహాలకు క్షీరాధివాసం, ధాన్యధివాసం, లష్టదిక్‌బలి, పంచశయ్యాదివాసం జరిపి మంగళ హారతులిస్తారు. ఆదివారం ఉదయం 9.49 గంటలకు విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్ట వేదమంత్రోచ్ఛరణలు చేయనున్నారు. మధ్యాహ్నం రామాలయం ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం కోలాటాలు, గరిడీలు, మేళతాళాలు, తప్పెటగుళ్లు, మందుగుండు సామాగ్రి నడుమ సీతారాముల పల్లకి ఊరేగింపు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై యువకుల దాడి

పెందుర్తి: మద్యం మత్తులో ముగ్గురు యువకులు ఓ ఆటో డ్రైవర్‌పై విచక్షిణరహితంగా దాడికి పాల్పడ్డారు. తీవ్రగాయాలపాలవ్వడంతో అత్యవసర చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వివరాలివి..పెందుర్తి మండలం కరకవానిపాలెనికి చెందిన ఎస్.కె ఖాన్ ఆటో నడుపుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి పెందుర్తి కూడలి వద్ద పెట్రోల్ బంక్ వద్దకు ఇంధనం కోసం ఆటో తీసుకువచ్చాడు. అదే సమయంలో అక్కడే మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు ఖాన్‌తో కారణం లేకుండా వివాదానికి దిగారు. దీనిపై ఖాన్ ప్రశ్నించడంతో అతడిపై ముగ్గురు విచక్షిణారహితంగా పిడిగుద్దులు కురిపించారు. దీంతో ఖాన్ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. తక్షణమే స్పందించిన స్థానికులు అతడిని పెందుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు ఉత్తమ వ్యక్తిత్వం అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి. డాక్టర్ లక్ష్మీపార్వతి

ఏయూ క్యాంపస్: ఉత్తమ వ్యక్తిత్వంతో యువతరం ఎదగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఏయూ టీడీఆర్ హబ్, తెలుగుమల్లి(ఆస్ట్రేలియా) సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ప్రవాస సాహిత్యం(తెలుగు, హిందీ, ఇంగ్లిష్) అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భాషల పరిరక్షణకు, వికాసానికి సదస్సులు ఉపకరిస్తాయన్నారు. ప్రతి విద్యార్థికి తల్లిదండ్రులే నిజమైన రోల్‌మోడల్స్‌గా నిలుస్తారన్నారు. విదేశాలలో స్థిరపడిన భారతీయులు, తెలుగు వారు రాష్ట్రానికి, భాషకు వారధులుగా నిలుస్తున్నారన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీల చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ భాషను పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలుగు భాష అభివృద్ధికి ఏయూ అందిస్తున్న ప్రోత్సాహం అపారమన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com